విలేకరులు కావలెను

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్
రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న
పరివర్తన అవాజ్ దినపత్రికలో
పనిచేయుటకు జిల్లా స్టాఫ్ రిపోర్టర్స్,
నియోజకవర్గ ఆర్.సిలు,
మండల స్థాయి రిపోర్టర్లుగా
పనిచేయుటకు ఉత్సాహం కలిగిన
యువతీ, యువకులు కావలెను.

సీనియర్లకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును.

పరివర్తన ఆవాజ్

TGBIL/25/A2214 తెలుగు ఉర్దూ దినపత్రిక

PARIVARTHANA AWAAZ

పేపర్‌లో యాడ్స్ కొరకు
సంప్రదించండి
9704903467
8886183468

కామారెడ్డి - హైదరబాద్ - వరంగల్ - సంగారెడ్డి | 03-11-2026 మంగళవారం | సంపుటి:02 సంచిక : 32 | రూ॥ 5-00 | పేజీలు : 3

భవిత కేంద్రాల ద్వారా భవిష్యత్ మార్చుకోవాలి..

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక నవంబర్ 2: ప్రత్యేక అవసరాలు గల పిల్లలు ఆత్మవిశ్వాసంతో ఉన్నత లక్ష్యాలను సాధించేలా భవిత కేంద్రాల ద్వారా నాణ్యమైన విద్య, ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద తెలిపారు. దివ్యాంగ విద్యార్థుల అభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా భాగస్వాములు కావాలని ఆమె పిలుపునిచ్చారు.సమ్మిళిత విద్యపై ప్రత్యేక అవసరాలు గల పిల్లల తల్లిదండ్రులు, సంబంధిత వ్యక్తులకు వరంగల్‌లోని ఆకుతోట కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి అవగాహన, శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అవసరాలు గల పిల్లల అవసరాలను తల్లిదండ్రులు అర్థం చేసుకుని, వారికి అవసరమైన సదుపాయాలు కల్పించేందుకు చొరవ చూపాలన్నారు. సమ్మిళిత విద్యలో తల్లిదండ్రుల పాత్ర ఎంతో కీలకమని, పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయులు, ఐఈఆర్‌పీలు, ఇతర నిపుణులతో సమన్వయం చేసుకుంటూ పిల్లల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. స్టీఫెన్ హాకింగ్, ఐజాక్ న్యూటన్, ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వంటి ప్రముఖులు ఎన్నో సవాళ్లను అధిగమించి ప్రపంచస్థాయిలో గుర్తింపు పొందారని గుర్తుచేశారు.అంతర్జాతీయ క్రీడా వేదికపై పతకాలు సాధించిన దివ్యాంగ క్రీడాకారిణి దీప్తి జీవాంజిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దివ్యాంగ హక్కుల చట్టం–2016 ప్రకారం ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు విద్య, ఉపాధి, ఆరోగ్యం, సామాజిక జీవనం, ప్రజా సేవల్లో సమాన హక్కులు ఉన్నాయని తెలిపారు. దివ్యాంగుల పట్ల ఉన్న అపోహలు, వివక్షను తొలగించి, సమాజంలోని అన్ని కార్యక్రమాల్లో వారిని భాగస్వాములను చేయాలని కోరారు.జిల్లా విద్యాశాఖ అధికారి ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ సమ్మిళిత విద్య ద్వారా ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు సాధారణ విద్యార్థులతో సమానంగా విద్యను అభ్యసించే అవకాశాలు కల్పించవచ్చన్నారు. ప్రశస్తి యాప్ ద్వారా ప్రతి పాఠశాలలో ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ప్రారంభ దశలోనే గుర్తించి స్క్రీనింగ్ చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల వినికిడి, దృష్టి, శారీరక, మేధో, అభ్యాస, భాషా తదితర అంశాలకు సంబంధించి 21 రకాల వైకల్యాలను ప్రాథమికంగా గుర్తించి, అవసరమైన వారికి తగిన వైద్య, విద్యా సహాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.కార్యక్రమ సమన్వయకర్త, ఇంక్లూసివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్ డాక్టర్ కట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లాలో 18 మంది ప్రత్యేక విద్యా ఉపాధ్యాయులు, 17 మంది ఐఈఆర్‌పీలు, ముగ్గురు ఫిజియోథెరపిస్టులు సేవలందిస్తున్నారని తెలిపారు. ప్రతి విద్యార్థి సామర్థ్యం, అవసరాలను బట్టి వ్యక్తిగత విద్యా ప్రణాళిక రూపొందించి చదవడం, రాయడం, అక్షరాలు, సంఖ్యలు, ప్రాథమిక గణిత నైపుణ్యాల్లో ప్రత్యేక శిక్షణ అందిస్తున్నామన్నారు.సోమవారం నుంచి శుక్రవారం వరకు భవిత కేంద్రాల్లో ప్రత్యేక విద్యా శిక్షణ అందిస్తామని, తీవ్రమైన లేదా బహుళ వైకల్యాల కారణంగా పాఠశాలకు హాజరుకాలేని పిల్లలకు ఇంటి వద్దనే విద్య, అభివృద్ధికి సంబంధించిన శిక్షణ అందించేలా ప్రత్యేక ఉపాధ్యాయులు మార్గదర్శనం చేస్తారని వివరించారు.విద్యార్థులకు అవసరమైన వీల్‌చైర్లు, ట్రైసైకిళ్లు, వాకింగ్ ఎయిడ్స్, వినికిడి పరికరాలు తదితర సహాయక పరికరాలను గుర్తించి అందించేందుకు సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో ప్రత్యేక శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు.జిల్లాలోని ప్రతి మండలంలో వారానికి రెండుసార్లు ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు ఫిజియోథెరపీ సేవలు అందించేందుకు శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. పిల్లల శారీరక సామర్థ్యం, కదలికలు, మోటార్ నైపుణ్యాల అభివృద్ధికి అవసరమైన వ్యాయామాలు, శిక్షణతో పాటు తల్లిదండ్రులకు ఇంటి వద్ద చేయాల్సిన వ్యాయామాలపై సూచనలు అందిస్తామని తెలిపారు.కార్యక్రమంలో స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్ సంతోష్ ప్రదర్శించిన నృత్యం ఆకట్టుకోగా, దివ్య బృందం పాటలు ఆలపించింది. కౌన్సెలింగ్ సైకాలజిస్ట్ డాక్టర్ బరుపాటి గోపి దివ్యాంగులకు సంబంధించిన వివిధ సమస్యలు, వాటి పరిష్కార మార్గాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజారెడ్డి, విద్యాశాఖ క్వాలిటీ కోఆర్డినేటర్ మహేష్ నాయక్, డీసీసీబీ సెక్రెటరీ కృష్ణమూర్తి, ప్లానింగ్ కోఆర్డినేటర్ విజయ్ కుమార్, ఏఎస్ఓ వేణుగోపాల్, జిల్లా సైన్స్ అధికారి సురేష్ బాబు, శ్రవణ్ కుమార్, కన్వీనర్లు బి. నరసింహారావు, వి. రామకృష్ణారెడ్డి, బి. ప్రసాద్, కో–కన్వీనర్లు కృష్ణారెడ్డి, పిన్నింటి బాలాజీరావు, అనుపమ, పరమేశ్వర్, రిసోర్స్ పర్సన్లు అనిల్ కృపాకర్, నరసింహస్వామి, శ్రీనివాస్, ప్రియాంక, మహేందర్, వరలక్ష్మి, వివిధ మండలాల ఎంఈఓలు, విద్యార్థిని విద్యార్థులు వారి తల్లిదండ్రులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజావాణిలో 198 అర్జీలు స్వీకరణ



వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక నవంబర్ 2 : ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, నిబంధనల ప్రకారం సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధికారులను ఆదేశించారు.సోమవారం వరంగల్ జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి మొత్తం 198 అర్జీలను స్వీకరించారు.ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 69, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్‌కు 32, ఉపాధి శాఖ 12,లీడ్ బ్యాంక్ 12 ,రాగా ఇతర శాఖలకు సంబంధించి మరో 73 అర్జీలు అందినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం సమర్పించిన అర్జీలపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు.ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి, నిర్ణీత సమయంలో పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్జీదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో రెవెన్యూ, మున్సిపల్, లీడ్ బ్యాంక్ ,ఉపాధి శాఖలకు సంబంధించిన సమస్యలతో పాటు వృద్ధుల తమ సమస్యల పరిష్కారం కోసం అధిక సంఖ్యలో అర్జీలు సమర్పించారు.ప్రజావాణి సమస్యల పై వచ్చిన పిటిషన్ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సంబంధిత అధికారుల ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎల్. కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) వై.వి. గణేష్, డియార్వో విజయలక్ష్మి, జడ్పీ సీఈఓ వసంత, హౌసింగ్ పీడీ శ్రీవాణి, డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ రాజిరెడ్డి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ విశ్వప్రసాద్ తదితర అధికారులు పాల్గొన్నారు.

హనుమకొండలో ఐడియల్ హోమియోపతి క్లినిక్ ఉచిత వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది.

వందలాది మంది రోగులు ప్రయోజనం పొందారు, డాక్టర్ ఆయేషా ప్రత్యేక ప్రసంగం.



వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక నవంబరు 2 : ముస్లిం వెల్ఫేర్ సొసైటీ వరంగల్ ఆధ్వర్యంలో మరియు ఐడియల్ హోమియోపతి క్లినిక్ తరపున బొక్లగడ్డలో నిర్వహించిన ఒక రోజు ఉచిత హోమియోపతి వైద్య శిబిరం విజయవంతంగా ముగిసింది. ఈ శిబిరం నవంబర్ 1వ తేదీ ఆదివారం నాడు, ఐడియల్ గర్ల్స్ హాస్టల్, చర్చి దగ్గర, బొక్లగడ్డలో నిర్వహించబడింది, ఇందులో సంతానలేమి, పిసిఓడి, షుగర్, ఆస్తమాతో సహా 35 కి పైగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వందలాది మంది రోగులు ఉచితంగా పరీక్షలు చేయించుకుని చికిత్స పొందారు. సీనియర్ హోమియోపతి కన్సల్టెంట్ డాక్టర్ ఆయేషా మరియు డాక్టర్ మహమ్మద్ జావేద్ రోగులను పరీక్షించారు.ఈ సందర్భంగా డాక్టర్ ఆయేషా తన ప్రసంగంలో హోమియోపతి చికిత్సా విధానం యొక్క ప్రయోజనాలను వివరిస్తూ పాత మరియు దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోపతిలో విజయవంతమైన చికిత్స సాధ్యమని అన్నారు. శిబిరం ద్వారా ప్రయోజనం పొందిన రోగులు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుతూ సంతోషం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్సీ ఓటు హక్కుపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద

స్వీప్ కార్యక్రమంలో భాగంగా వరంగల్ ఓ సిటీ నుంచి కాశీబుగ్గ సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ...



వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక నవంబర్ 2:ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై అర్హులైన ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో స్వీప్ (స్వీప్) కార్యక్రమంలో భాగంగా సోమవారం వరంగల్ ఓ సిటీ నుంచి కాశీబుగ్గ సర్కిల్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎమ్మెల్సీ ఓటరు నమోదు, ఓటు హక్కు ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద మాట్లాడుతూ...ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి అర్హులైన పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటరు జాబితాలో తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు.ఓటరు నమోదు ప్రక్రియపై సరైన అవగాహన కలిగి ఉండాలని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా విస్తృతంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరమని, ఓటు హక్కు వినియోగంపై ఇతరులకు కూడా అవగాహన కల్పించాలని కోరారు.స్వీప్ కార్యక్రమాల ద్వారా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ఓటరు నమోదు శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ ర్యాలీలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్,అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, డియార్వో విజయలక్ష్మి, జడ్పీ సీఈఓ వసంత, స్వీప్ నోడల్ అధికారి.. మరియు తదితరులు పాల్గొన్నారు

ఆర్భాటాల కంటే ఆకలి తీర్చడంలోనే అసలైన ఆనందం

దివ్యాంగుల మధ్య బేతి మనోజ్ఞ జన్మదిన వేడుకలు

పేదలు, అనాథలకు అండగా నిలవాలి: బేతి అశోక్ బాబు



వరంగల్ జిల్లా ప్రతినిది పరివర్తన అవాజ్ నవంబర్ 2: పుట్టినరోజు వేడుకలను హంగులు, ఆర్భాటాలతో కాకుండా నిరుపేదలు, దివ్యాంగులు, అనాథల మధ్య జరుపుకుంటూ వారి ఆకలి తీర్చడంలోనే నిజమైన ఆనందం ఉందని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబు అన్నారు.కాశిబుగ్గలోని మదర్ తెరిసా ఫౌండేషన్‌లో బేతి మనోజ్ఞ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని దివ్యాంగుల మధ్య కేక్ కట్ చేసి, పండ్లు పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ.. పుట్టినరోజు వేడుకల కోసం అనవసరంగా ఖర్చు చేసే బదులు, ఆ మొత్తంతో ఆకలితో ఉన్నవారికి అన్నం పెట్టడం, నిరుపేదలకు సహాయం చేయడం ఎంతో సంతృప్తినిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ తమ శుభకార్యాలను సేవా కార్యక్రమాలతో ముడిపెట్టి, సమాజంలో ఆదరణకు నోచుకోని వారికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.మన ఆనందంలో నలుగురిని భాగస్వాములను చేయడం, ఆకలితో ఉన్నవారి కడుపు నింపడం కంటే గొప్ప వేడుక మరొకటి లేదని పేర్కొన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వం, సోదరభావం, సేవా స్ఫూర్తిని పెంపొందిస్తాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో బేతి వీరలక్ష్మి, బేతి రాజు, బేతి శ్వేత, బేతి శోభారాణి, బేతి దివ్య, బేతి సాయి, బేతి నాని చారి, మదర్ తెరిసా ఫౌండేషన్ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బావార్చి హోటల్ సమీపంలో బోల్తా పడిన ట్రాక్టర్ ట్రాలీ

తృటిలో తప్పిన ప్రమాదం.. సురక్షితంగా బయటపడిన డ్రైవర్



పరివర్తన అవాజ్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని బావార్చి హోటల్ సమీపంలో ట్రాక్టర్ ట్రాలీ ప్రమాదవశాత్తు బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రయాణిస్తున్న ట్రాక్టర్ ట్రాలీ అదుపుతప్పి రహదారిపై బోల్తా పడింది. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు ఇతరులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. డ్రైవర్ సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో కొద్దిసేపు అక్కడి పరిసరాల్లో కలకలం నెలకొంది.

వయోవృద్దులు గౌరవప్రదంగా జీవించేలా చేయడం అందరి బాధ్యత – డాక్టర్ అనితా రెడ్డి

వయోవృద్దుల హక్కులకు భంగం కలిగిస్తే కఠినమైన చర్యలు



వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన ఆవాజ్ తెలుగు దినపత్రిక నవంబర్ 2: హన్మకొండ జిల్లా పరిషత్తు కార్యాలయ ఆవరణలో ఉన్న సీనియర్ సిటిజన్స్ డే కేర్ సెంటర్ నందు సీనియర్ సిటిజన్స్ ఫోరం వరంగల్ ఆధ్వర్యంలో ప్రెసిడెంట్ చంద్రమౌళి గారి అధ్యక్షతన నిర్వహించిన సీనియర్ సిటిజన్స్ ఆత్మీయ సమావేశం చట్టాలపై అవగాహన, కార్యచరణ కార్యక్రమాల నిర్ణయాలపై నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టు మెంబర్ ,అనురాగ్ సొసైటీ చైర్మన్ డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ వయోవృద్దులు ఇంట బయట గౌరవప్రదమైన జీవితాన్ని అనుభవించాలని అది వారి హక్కు అని అన్నారు, వారి హక్కులకు భంగం కలిగించినా, వారి పోషణ,రక్షణలో ఇబ్బంది కలిగించినా చట్ట పరమైన చర్యలు తీసుకోబడతాయని సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ కోర్టును సంప్రదించవచ్చని అన్నారు, ఈ మధ్య పిల్లలు వివిధ కారణాల చేత తల్లిదండ్రుల దగ్గర ఉండకపోవడం తో వయోవృద్దులు ఒంటరిగా ఉండవలసి వస్తుందని వారు జాగ్రత్తగా ఉండాలని సైబర్ క్రైం స్,వివిధ క్రైంలకి సీనియర్ సిటిజన్స్ బలిఅవుతున్నారని, అపరిచితులైన పనివాళ్లని పెట్టుకున్నప్పుడు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని వారి ఆధార్ కార్డు, నివాసిత ప్రాంతం తెలుసుకోవాలని దీనిలో పోలీసుల సహాయం తీసుకోవాలని డాక్టర్ అనితా రెడ్డి వయోవృద్దులకు సూచించారు, ఏది ఏమైనా సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ బెంచ్ పై మరియు చట్టం పై ప్రజల్లో అవగాహన అవసరం అని అది కల్పించేందుకు నా వంతు ప్రయత్నం నేను చేస్తున్నాని కానీ ఎందుకో ఈ తరానికి అమ్మ నాన్నలు పిల్లలకు బరువు అవుతున్నారన్నది జీర్ణించుకోలేని వాస్తవం అని,వృద్ధాప్యము శాపముగా మారుతుంది కొందరి వృద్ధులకు, ఇది కూడా పచ్చి నిజం అని, సీనియర్ సిటిజన్స్ ట్రిబ్యునల్ బెంచ్ మెంబర్ గా నా వంతు నేను చేయ గలిగింది చేస్తున్న, అయినా ఎందుకో ఎప్పుడు నాకు ఆవేదన గానే ఉంటుంది, ప్రతి సారి వచ్చే కేసులు చూస్తూంటే అందరూ ఆలోచించాల్సిన అంశం అనిపిస్తుంది, బుక్కేడు బువ్వ కూడ పెట్టను అంటున్నారు అమ్మ మా పిల్లలు అని చెబుతుంటే వింటున్న నా మనస్సు మెలిపెడుతుంది, అలాగే ప్రభుత్వం, మీరు చేసే పని సరిపోవడం లేదు మీ మెదడుకి ఇంకా పదునుపెట్టండి మా వృద్ధులకు న్యాయం చేయాలంటే అని పిటిషన్లు ఇచ్చే వయోవృద్దులు అడుగుతున్నట్లే అని పించి ఆవేదనగా అనిపిస్తుందని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు,నేను చేయగలిగే ఏ సహాయ సహకారాలు కావాలన్న తాను చేయడానికి సిద్ధంగా ఉన్నానని వయోవృద్దులకు డాక్టర్ అనితా రెడ్డి మాట ఇచ్చారు, డాక్టర్ అనితా రెడ్డి, చంద్రమౌళి, సెక్రటరీ దేవాచారీ, పి. వి. శ్రీనివాస్, విజయలక్ష్మి, గోపాల్ రావు, విజయ బాబు, సరళ, పొన్నాల రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించండి, బల్దియా కమిషనర్ వెంకన్న

ప్రజావాణిలో 116 దరఖాస్తుల స్వీకరణ.....

సమస్యల పరిష్కారం లో జవాబుదారీ తనం అవసరమన్న కమిషనర్.



వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక నవంబర్ 2: గ్రీవెన్స్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు.సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదుల సంబంధ దరఖాస్తులను స్వీకరించి ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావానికి అనుగుణంగా ఆయా విభాగాలకు బదలాయించారు. గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని, జాప్యాన్ని సహించేది లేదని అధికారులకు సూచించారు. నిర్దేశిత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. గత వారం ప్రజావాణిలో స్వీకరించిన వినతుల పరిష్కార స్థితిగతులను కమిషనర్ విభాగాల వారీగా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను తక్షణమే పరిష్కరించడంతో పాటు, తీసుకున్న చర్యలను సంబంధిత ఫిర్యాదుదారులకు తెలియజేయాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో అనవసర జాప్యం జరిగితే సంబంధిత అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని,ప్రజలకు అందించే ప్రతి పౌర సేవలో పారదర్శకత, జవాబుదారీతనం, వేగం ఉండాలని కమిషనర్ పేర్కొన్నారు. ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల వివరాలు...టౌన్ ప్లానింగ్ -- 51,ఇంజినీరింగ్ -- 46,ఆరోగ్యం, పారిశుద్ధ్యం -- 11,రెవెన్యూ -- 06,హార్టికల్చర్ -- 01,నీటి సరఫరా...01,మొత్తం 116 దరఖాస్తులు..ఈ కార్యక్రమంలో ఇంచార్జి అదనపు కమిషనర్ సమ్మయ్య, సూపరింటెండింగ్ ఇంజినీర్ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్,ముఖ్య హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, సెక్రటరీ అనిల్‌బాబు, పన్నుల అధికారి రామకృష్ణ అన్ని విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల గురించి మాట్లాడే నైతిక హక్కు బిఆర్ఎస్ పార్టీకి లేదు: ఎమ్మెల్యే నాయిని.

అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ప్రతిపక్షాల విమర్శలకు ఘాటుగా కౌంటర్...



వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక నవంబర్ 2: సోమవారం అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూదేశవ్యాప్తంగా రైతులకు రూ. 2 లక్షల వరకు రుణమాఫీ చేసి, కాంగ్రెస్ పార్టీ సుమారు రూ. 70 వేల కోట్ల రుణభారాన్ని తగ్గించిన చరిత్రను ప్రతిపక్షాలు మర్చిపోతున్నాయని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. రైతుల గురించి మాట్లాడే ముందు గతంలో మీరు చేసిన పనులను గుర్తు చేసుకోవాలని హితవు పలికారు. 125 ఏళ్ల చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీకి పెద్దగా మీడియా సంస్థలు, వందల కోట్ల ఆస్తులు లేకపోయినా ప్రజల కోసం పోరాడుతోందని, కానీ టబి ఆర్ ఎస్ఊ నాయకులు మాత్రం వేల కోట్ల రూపాయలు ఎలా సంపాదించారో ప్రజలకు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.కాలేజీల్లో పనిచేసే ఉపాధ్యాయులు, ఉద్యోగుల పేరుతో వందల కోట్ల రూపాయలు బినామీల పేర్లతో దోచుకుని. ఆ డబ్బుతో కొన్ని యూట్యూబ్ ఛానళ్లు ఏర్పాటు చేసుకుని ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు చేయడం అలవాటుగా మారిందని విమర్శించారు.పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గెలవలేని వారు ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తామని, మంత్రులవుతామని పగటి కలలు కంటూ మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు.గత ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీశారని, ఖాళీగా ఉన్న ధాన్యం గోదాములు, ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. గతంలో ప్రభుత్వ ఆస్తుల వేలం ద్వారా నిధులు సమకూర్చుకునే ప్రయత్నాలు చేసిన వారే, ఇప్పుడు ప్రభుత్వం ఆదాయం పెంచుకునేందుకు చేపడుతున్న చర్యలపై విషప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు.ప్రభుత్వం ఏ అభివృద్ధి కార్యక్రమం చేపట్టినా కమిషన్లు, అవినీతి అంటూ నిరాధార ఆరోపణలు చేయడం ప్రతిపక్షాలకు పరిపాటిగా మారిందని విమర్శించారు. రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ చేసిన రుణమాఫీ, తీసుకుంటున్న చర్యలను గుర్తించకుండా రాజకీయ విమర్శలు చేయడం సిగ్గుచేటని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఘాటుగా స్పందించారు

బల్దియా ఇంచార్జి అదనపు కమిషనర్‌గా సమ్మయ్య.



వరంగల్ టౌన్ పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక నవంబర్ 2: బల్దియా ఇంచార్జి అదనపు కమిషనర్‌గా నియమితులైన సమ్మయ్య సోమవారం జీడబ్ల్యూఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్ టి.వెంకన్నను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. అదనపు కమిషనర్ జోనా పదవీ విరమణతో ఏర్పడిన ఖాళీ నేపథ్యంలో సీనియర్ అధికారి అయిన సమ్మయ్యకు ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు

నరకాసుర వధ కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలి: జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న

వివిధ శాఖల అధికారులకు ఏర్పాట్లపై దిశానిర్దేశం

విధి నిర్వహణలో వాకీటాకీల వినియోగం తప్పనిసరి





జిడబ్ల్యూఎంసి వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక నవంబర్ 02: దీపావళి సందర్భంగా ఉర్సు రంగలీల మైదానంలో నిర్వహించనున్న నరకాసుర వధ కార్యక్రమానికి పటిష్ట ఏర్పాట్లు చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి.వెంకన్న అధికారులను ఆదేశించారు.సోమవారం ప్రజావాణి కార్యక్రమం అనంతరం కౌన్సిల్ హాల్‌లో వివిధ విభాగాల ఉన్నతాధికారులతో సమావేశమైన కమిషనర్ మాట్లాడుతూ, కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా బారికేడ్లు, లైటింగ్, పారిశుధ్యం, తాగునీటి సౌకర్యం తదితర ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. ఏర్పాట్లన్నింటినీ కాశీబుగ్గ డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షించాలని ఆదేశించారు.అదేవిధంగా , విధి నిర్వహణలో అధికారులు, సిబ్బంది తమకు కేటాయించిన వాకీటాకీలను తప్పనిసరిగా వినియోగించాలని స్పష్టం చేశారు. ఉన్నతాధికారులు ఇచ్చే సూచనలు, సమాచారాన్ని ఎప్పటికప్పుడు తెలుసుకోవడం ద్వారా సమన్వయంతో విధులు నిర్వహించేందుకు వీలవుతుందని పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కమిషనర్ సమ్మయ్య, ఎస్ఈ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, ముఖ్య ఉద్యానవన అధికారి లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, కార్యదర్శి అనిల్‌బాబు, పన్నుల అధికారి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నవంబర్ 2 నుంచి 15వ తేదీ వరకు చేనేత వస్త్ర ప్రదర్శన.

పజలు సందర్శించి చేనేత వస్త్రాలను కొనుగోలు చేయాలి.

వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద...



వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక నవంబర్ 2: కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ, డెవలప్‌మెంట్ కమిషనర్ ఫర్ హ్యాండ్లూమ్స్, తెలంగాణ రాష్ట్ర చేనేత, జౌళి శాఖ, చేనేత సహకార సంఘాల ఆధ్వర్యంలోహనుమకొండలోని రెడ్డి మ్యారేజ్ ఫంక్షన్ హాల్, ఎన్.జి.ఓ.ఎస్ కాలనీ లో సోమవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ చేనేత వస్త్ర ప్రదర్శన నవంబర్ 2 నుంచి 15వ తేదీ వరకు మొత్తం 14 రోజుల పాటు ఈ ప్రదర్శన కొనసాగుతుందన్నారు.ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు సందర్శకులకు అందుబాటులో ఉంటుంది. -చేనేత కార్మికులకు ప్రోత్సాహం లక్ష్యం..చేనేత కార్మికుల నైపుణ్యాన్ని ప్రోత్సహించడం, వారి ఉత్పత్తులకు మార్కెటింగ్ సదుపాయాలను కల్పించడం, చేనేత వస్త్రాలపై ప్రజలకు అవగాహన పెంపొందించడం లో ఈ ప్రదర్శన ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ తెలిపారు. చేనేత కార్మికులకు నిరంతర పని, ఉపాధి కల్పించడంతో పాటు, వారు తయారు చేసిన వస్త్రాలకు డిమాండ్ పెంచేందుకు ఈ ప్రదర్శన దోహదపడుతుందని పేర్కొన్నారు. -వివిధ రాష్ట్రాల ప్రత్యేక చేనేత వస్త్రాలు...ఈ ప్రదర్శనలో గద్వాల్, పోచంపల్లి, వెంకటగిరి, ఉప్పాడ, మంగళగిరి, ధర్మవరం తదితర ప్రాంతాలకు చెందిన ప్రత్యేక చేనేత చీరలు, డ్రెస్ మెటీరియల్స్, కరీంనగర్ బెడ్‌షీట్లు, బంగిమ్స్, టవల్స్‌తో పాటు వివిధ రకాల నాణ్యమైన చేనేత వస్త్రాలను అందుబాటులో ఉంచనున్నారు.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్, జమ్మూ కాశ్మీర్, మధ్యప్రదేశ్ తదితర రాష్ట్రాలకు చెందిన సుమారు 60 ప్రాథమిక చేనేత సహకార సంఘాలు ఈ ప్రదర్శనలో పాల్గొంటున్నాయి. ఈ కార్యక్రమంలో ఏ డి హ్యాండ్లూమ్ శ్రీకాంత్ రెడ్డి, వరంగల్ ఆర్డీవో సుమ నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, డి సి ఓ నీరజ, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు,ఫిషరీస్ శ్రీపతి తదితరులు పాల్గొన్నారు.వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రజలు ఈ ప్రదర్శనను సందర్శించి, వివిధ రాష్ట్రాల ప్రత్యేక చేనేత వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత కార్మికులను ప్రోత్సహించాలని నిర్వాహకులు కోరారు.

అక్రిడిటేషన్ కార్డుల కోసం కేబుల్ ఛానెల్స్ గర్జన.. సమాచార శాఖ కార్యాలయం ఎదుట మహా నిరసన



హైదరాబాద్ ప్రతినిధి పరివర్తన అవాజ్ తెలుగు దినపత్రిక నవంబర్ 2: తెలంగాణ రాష్ట్రంలో కేబుల్ ఛానెల్స్, ఐపీ టీవీలకు సంబంధించిన అక్రిడిటేషన్ కార్డుల జారీలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ కేబుల్ ఛానెల్స్ ప్రతినిధులు ఆందోళన చేపట్టారు. తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ కేబుల్ ఛానెల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయం ఎదుట మహా నిరసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 120 మంది కేబుల్ ఛానెల్స్ నిర్వాహకులు, జర్నలిస్టులు, ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఏసీ ప్రతినిధులు మాట్లాడుతూ, అర్హులైన కేబుల్ ఛానెల్స్, ఐపీ టీవీ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయడంలో జరుగుతున్న జాప్యంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. జిల్లాల వారీగా నిర్వహిస్తున్న వెరిఫికేషన్ ప్రక్రియలో స్పష్టత కొరవడిందని, ఒక్కో జిల్లాలో ఒక్కో విధమైన నిబంధనలు అమలవుతున్నాయనే ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా అక్రిడిటేషన్ వెరిఫికేషన్‌కు ఒకే విధమైన మార్గదర్శకాలను అమలు చేయాలని, దరఖాస్తుల పరిశీలనలో పారదర్శకత పాటించాలని డిమాండ్ చేశారు. అర్హులైన జర్నలిస్టులకు వెంటనే అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేయడంతో పాటు కేబుల్ ఛానెల్స్, ఐపీ టీవీల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ప్రజలకు స్థానిక వార్తలను చేరవేయడంలో కేబుల్ ఛానెల్స్, ఐపీ టీవీలు కీలక పాత్ర పోషిస్తున్నాయని జేఏసీ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి, అర్హులైన జర్నలిస్టులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈ నిరసన కార్యక్రమంలో కేబుల్ టీవీ ఛానెల్స్ యాజమాన్యాల జేఏసీ నాయకులు, కేబుల్ టీవీ, ఐపీ టీవీ సీఈవోలు, జిల్లా ప్రతినిధులు, నియోజకవర్గ స్థాయి రిపోర్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రెస్టారెంట్లలో కృత్రిమ ఆహార రంగుల వినియోగం, అపరిశుభ్రతపై తనిఖీలు

అనుమతిలేని కృత్రిమ రంగులు వినియోగిస్తే కఠిన చర్యలు: ఆహార భద్రత అధికారి విక్రమ్



కామారెడ్డి పరివర్తన. అవాజ్ తెలుగు దినపత్రిక నవంబర్ 2: : కామారెడ్డి జిల్లాలో ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలనే లక్ష్యంతో ఆహార భద్రతా శాఖ ఆధ్వర్యంలో సోమవారం రెస్టారెంట్లు, ఆహార విక్రయ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.నిఈ తనిఖీల్లో భాగంగా కామారెడ్డి పట్టణంలోని అల్ సుభాన్ రెస్టారెంట్‌ను ఆహార భద్రత అధికారి విక్రమ్ తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా చికెన్ కూరలు, వేయించిన అన్నం తదితర వంటకాల తయారీలో అనుమతిలేని కృత్రిమ ఆహార రంగులు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా వంటశాల అపరిశుభ్రంగా ఉండటం, వ్యర్థాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, వంట సిబ్బంది తల కవర్లు, చేతి తొడుగులు, ఏప్రాన్లు ధరించకపోవడం వంటి లోపాలను గుర్తించారు.నిఈ సందర్భంగా మానవ వినియోగానికి పనికిరాని సుమారు 15 కిలోల నిల్వ ఆహార పదార్థాలను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అనుమానిత ఆహార నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించారు. సంబంధిత ఆహార వ్యాపార సంస్థకు ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం, 2006లోని సెక్షన్ 32 ప్రకారం నోటీసు జారీ చేశారు.నిఅదేవిధంగా కామారెడ్డి పట్టణంలోని ఎస్ఎస్ఎస్ టిఫిన్ సెంటర్‌ను కూడా తనిఖీ చేశారు. అక్కడ వంటశాల అపరిశుభ్రంగా ఉండటం, వ్యర్థాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వంటి పరిశుభ్రతా లోపాలను గుర్తించారు. సంబంధిత సంస్థకు మెరుగుదల నోటీసు జారీ చేసి, అనుమానిత ఆహార నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించారు. ప్రయోగశాల నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.నిఈ సందర్భంగా ఆహార భద్రత అధికారి విక్రమ్ మాట్లాడుతూ, హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు ఆహార భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వంటశాలలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఆహార తయారీలో నాణ్యమైన ముడి పదార్థాలను మాత్రమే వినియోగించాలని, సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఆహార పదార్థాల్లో నిబంధనలకు విరుద్ధంగా కృత్రిమ రంగులు కలపడం నిషేధమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.నిప్రజలకు విజ్ఞప్తి:నిప్రజలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార పదార్థాలను కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అధికంగా కృత్రిమ రంగులు కలిపిన ఆకర్షణీయమైన ఆహార పదార్థాలను తీసుకోవద్దని సూచించారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో అనుమానాలు ఉన్నట్లయితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

మురాసు తుఫాన్ ప్రభావంతో లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా యంత్రాంగం ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలి

24 గంటల పాటు కంట్రోల్ రూమ్ సేవలు -- టోల్ ఫ్రీ నంబర్ 1800 425 3424



వరంగల్ జిల్లా ప్రతినిధి పరివర్తన. అవాజ్ తెలుగు దినపత్రిక నవంబర్ 2: జిల్లాలో వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.సోమవారం జిల్లా స్థాయి అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి తుఫాన్ ప్రభావం, భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మురసు తుఫాన్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వర్షాల కారణంగా వరద ముప్పు పొంచి ఉన్న ప్రాంతాలను అధికారులు ముందుగానే గుర్తించి అవసరమైన జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెరువులు, కుంటలు, వాగులు, వంకల వద్ద ప్రజలు వెళ్లకుండా తగిన చర్యలు తీసుకోవాలని, పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. ప్రజలకు అవసరమైన సహాయక చర్యలు అందించేందుకు సంబంధిత శాఖల సిబ్బంది అందుబాటులో ఉండాలని ఆదేశించారు.24 గంటలు కంట్రోల్ రూమ్ సేవలు ప్రజలకు అందుబాటులో ఉండేందుకు జిల్లా కలెక్టరేట్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తెలిపారు.కంట్రోల్ రూమ్ టోల్ ఫ్రీ నంబర్ 1800 425 3424 ద్వారా 24 గంటల పాటు సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.వర్షాలు, వరదలు లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు ప్రజలు కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని సూచించారు. ప్రజలు వాతావరణ పరిస్థితులను గమనిస్తూ అప్రమత్తంగా ఉండాలని, అధికారులు జారీ చేసే సూచనలు, హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద కోరారు.

ప్రజావాణిలో 71 ఫిర్యాదులు స్వీకరించిన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

ప్రజల సమస్యలను గడువులోగా పరిష్కరించాలి



కామారెడ్డి పరివర్తన. అవాజ్ తెలుగు దినపత్రిక నవంబర్ 2: ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, వినతులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు.సోమవారం కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్ ప్రజల నుంచి 71 ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు. అనంతరం వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపించి, ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయరాదని స్పష్టం చేశారు. ప్రతి అర్జీపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ, ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించడంతో పాటు, పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను సంబంధిత పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని సూచించారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం పొందేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విక్టర్, డీఆర్వో పాండు, సీఈవో చందర్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

